సాక్షి
డా. బి ఆర్ అంబేద్కర్ కోనసీమ
మంగళవారం । 3 । సెప్టెంబర్ । 2024



## ఘనంగా అష్టోత్తర అర్చనలు


ఆత్రేయపురం: వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయ ఆవరణలో సోమవారం స్వామివారి అష్టోత్తర పూజలు ఘనంగా చేశారు. ఆలయ ఈఓ కిషోర్‌కుమార్ పర్యవేక్షించారు.



## విఘ్నేశ్వరునికి కళన్యాస పూజలు

అయినవిల్లి: స్థానిక విఘ్నేశ్వర స్వామివారికి వేదపండితుల ఆధ్వర్యంలో సోమవారం కళన్యాస పూజలు జరిపారు. స్వామికి పంచామృతాభిషేకం, లక్ష గరిక పూజలు చేశారు.

## సముద్రంలోకి మిగులు జలాలు



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి సోమవారం సాయంత్రం 3,40,543 క్యూసెక్కుల మిగులు జలాలను సముద్రంలోకి విడుదల చేశారు. ఇక్కడ 8.60 అడుగులకు నీటిమట్టం చేరింది. సాగు అవసరాలకు తూర్పు డెల్టాకు 1,500, మధ్య డెల్టాకు 500, పశ్చిమ డెల్టాకు వెయ్యి క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు.

## న్యూస్‌రీల్

### పెరుగుతున్న వరద

పి.గన్నవరం: ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలతో వశిష్ఠ, వైనతేయ, గౌతమీ నదీ పాయల్లో వరద ఉధృతి క్రమేపీ పెరుగుతోంది. చాకలిపాలెం శివారు కనకాయలంక కాజ్‌వే పైకి సోమవారం వరద నీరు చేరుకుంది. మండలంలోని ఊడిమూడిలంక, జి.పెదపూడిలంక, అరిగెలవారిలంక, బూరుగులంక గ్రామాల ప్రజలు వరద ఉధృతిలో పడవలపైనే రాకపోకలు సాగిస్తున్నారు.

### భార్యను స్వదేశానికి తీసుకురావాలంటూ వేడుకోలు

కలెక్టర్‌కు భర్త విజ్ఞప్తి



తన ఇద్దరు పిల్లలతో కలెక్టరేట్‌కు వచ్చిన పావని భర్త దుర్గాప్రసాద్

అమలాపురం రూరల్: బెహ్రాయిన్‌లో తన భార్య ఇబ్బందులు పడుతోందని, స్వదేశానికి తీసుకురావాలంటూ ఓ వ్యక్తి కలెక్టర్‌ను వేడుకున్నాడు. ఆ వివరాల్లోకి వెళ్తే.. అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురం మండలం నడిపూడికి చెందిన దుక్కిపాటి పావని ఓ ఏజెంట్ ద్వారా గత నెల 25న బెహ్రాయిన్‌లోని ఓ ఇంట్లో పని నిమిత్తం వెళ్లింది. అక్కడ అనేక అవస్థలు పడుతున్నట్లు ఆమె ఫోన్‌లో ఆడియో రికార్డింగ్ ద్వారా కుటుంబ సభ్యులకు సందేశం పంపింది. అక్కడికి వెళ్లినప్పటి నుంచి తిండి, నీరు లేక అలమటిస్తున్నానని ఆమె పేర్కొంది. తన ఆరోగ్యం క్షీణించిందని తనను ప్రభుత్వం తిరిగి స్వదేశానికి తీసుకురావాలని పావని వేడుకుంది. ఈ మేరకు భార్య ఆడియో రికార్డింగ్‌తో భర్త దుర్గాప్రసాద్, ఇద్దరు పిల్లలతో వచ్చి సోమవారం అమలాపురం కలెక్టరేట్‌లో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్ మహేష్ కుమార్‌కు ఫిర్యాదు చేశారు. తన భార్యను ఎలాగైనా తిరిగి ఇంటికి తీసుకువచ్చి న్యాయం చేయాలని కలెక్టర్‌ను కోరారు.

### యువకులపై కేసు నమోదు

తాళ్లరేవు: పిల్లంక ఏటిగట్టు రహదారిలో మద్యం మత్తులో ముగ్గురు యువకులు పలువురిపై దాడి చేశారు. ఆ ముగ్గురు యువకులపై కేసు నమోదు చేసినట్లు కోరంగి ఎస్‌ఐ పి.సత్యనారాయణ తెలిపారు. ఆయన చెప్పిన వివరాల మేరకు పిల్లంక ఏటిగట్టు రహదారిలో గోపులంక వద్ద మద్యం తాగుతున్న యానాంకు చెందిన ముగ్గురు యువకులను ప్రశ్నించిన వారిని దాడి చేసి గాయపరిచారు. ఈ దాడిలో నలుగురికి గాయాలయ్యాయి. ఈ కేసుకు సంబంధించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

**ఇసుక లారీ పట్టివేత**

స్థానిక పుష్కరాల రేవు వద్ద తరలించేందుకు సిద్ధంగా ఉన్న ఇసుక లారీని సోమవారం పట్టుకున్నట్లు కోరంగి ఎస్‌ఐ పి.సత్యనారాయణ తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నామన్నారు.

# సంక్షేమ సారథి వైఎస్సార్



అమలాపురంలో డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి విశ్వరూప్, ఎమ్మెల్సీ ఇజ్రాయిల్, పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు



మలికిపురంలో రాజశేఖరరెడ్డి విగ్రహానికి నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు

- రాజశేఖరరెడ్డి విగ్రహాల వద్ద నివాళి
- పెద్ద ఎత్తున పాల్గొన్న ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు

సాక్షి, అమలాపురం: సంక్షేమ సారథి.. దివంగత మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతి వేడుకలు జిల్లా వ్యాప్తంగా ఘనంగా జరిగాయి. వైఎస్సార్ సీపీకి చెందిన ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, వైఎస్సార్ అభిమానుల సమక్షంలో సోమవారం వైఎస్సార్ వర్ధంతి వేడుకలు జరిగాయి. పార్టీకి చెందిన ఎమ్మెల్సీలు, మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేలు, మున్సిపల్ చైర్మన్‌లు, జెడ్పీటీసీలు, ఎంపీపీలు పెద్ద ఎత్తున పాల్గొని వైఎస్సార్ సేవలను కొనియాడారు. అమలాపురం, రామచంద్రపురం, మండపేట మున్సిపాలిటీలు, ముమ్మిడివరం నగర పంచాయతీతో పాటు ఆయా మండల కేంద్రాలు, గ్రామాల్లో ఈ వేడుకలు జరిగాయి.

జిల్లా కేంద్రం అమలాపురంలో దివంగత వైఎస్సార్ వేడుకలు ఘనంగా జరిగాయి. స్థానిక బాలుర ఉన్నత పాఠశాల వద్ద మాజీ మంత్రి పినిపే విశ్వరూప్ ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో పార్టీకి చెందిన ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్‌తో పాటు పార్టీ స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీకి చెందిన నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. దివంగత నేత విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కొత్తపేట నియోజకవర్గం పరిధిలో పలుచోట్ల వైఎస్సార్ వర్ధంతి వేడుకలు జరిగాయి. రావులపాలెం సెంటర్‌లోని వైఎస్సార్ విగ్రహానికి మాజీ ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి ఆధ్వర్యంలో పార్టీ నాయకులు వర్ధంతి నిర్వహించారు. రాజోలు నియోజకవర్గం పరిధిలో రాజోలు, సఖినేటిపల్లి, మలికిపురం మండల కేంద్రాల్లో జరిగిన వర్ధంతిలో మాజీమంత్రి గొల్లపల్లి సూర్యారావు పాల్గొని వైఎస్సార్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. మలికిపురంలో పార్టీ మండల శాఖ అధ్యక్షుడు అడబాల బ్రహ్మాజీ ఏర్పాటు చేసిన దుప్పట్లను వికలాంగులకు అందజేశారు. మలికిపురంలో మాజీ ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు వైఎస్సార్ విగ్రహం వద్ద నివాళులర్పించారు.

రామచంద్రపురం నియోజకవర్గం పరిధిలో రామచంద్రాపురం, ద్రాక్షారామలో జరిగిన వేడుకల్లో పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి పిల్లి సూర్యప్రకాశ్ ఆధ్వర్యంలో వైఎస్సార్ వర్ధంతి వేడుకలు జరిగాయి. పార్టీ నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. మామిడికుదురు మండలం నగరంలో జరిగిన వర్ధంతి వేడుకల్లో మాజీ ఎమ్మెల్యే, పార్టీ సీనియర్ నాయకులు పాముల రాజేశ్వరీదేవి పాల్గొని వైఎస్సార్‌కు నివాళులర్పించారు. ఆమెతో పాటు పార్టీకి చెందిన నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. జిల్లాలో ముమ్మిడివరం నియోజకవర్గ పరిధిలో పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పితాని బాలకృష్ణ ఆధ్వర్యంలో వర్ధంతి వేడుకలు జరిగాయి. పార్టీ కోనసీమ జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు కాశి బాల మునికుమారితో పాటు పలువురు పాల్గొన్నారు. మండపేట నియోజకవర్గంలో జరిగిన వైఎస్సార్ వర్ధంతి వేడుకల్లో మున్సిపల్ చైర్మన్ పతివాడ దుర్గారాణితో పాటు పలువురు పాల్గొన్నారు.

# సత్యదేవా నమో నమః

ఘనంగా స్వామివారి జన్మ నక్షత్ర పూజలు



సత్యదేవుని ఆయుష్య హోమ పూర్ణాహుతిలో పాల్గొన్న దేవస్థానం చైర్మన్ రోహిత్ తదితరులు

అన్నవరం: రత్నగిరి వాసుడు సత్యదేవుని జన్మ నక్షత్రం 'మఖ' సందర్భంగా సోమవారం అన్నవరంలో ప్రత్యేక పూజలు జరిగాయి. సత్యదేవునికి జన్మ నక్షత్ర పూజలు, మూలవిరాట్‌కు అభిషేకాలు, ఆయుష్య హోమం నిర్వహించారు. ఆలయాన్ని తెల్లవారు జామున రెండు గంటలకు తెరిచి ఈ క్రతువులు జరిపారు. అనంతరం సత్యదేవుడు, అనంతలక్ష్మీ సత్యవతీదేవి అమ్మవారు, శంకరుల మూలవిరాట్‌లకు పంచామృతాభిషేకాలు చేశారు. అనంతరం దేవతా మూర్తులకు ముత్యాల కవచాల (ముత్తంగి సేవ) అలంకరణ చేసి పూజలు నిర్వహించారు. ఉదయం ఏడు గంటల నుంచి భక్తులను దర్శనాలకు అనుమతించారు. ఉదయం తొమ్మిది గంటల నుంచి 11 గంటల వరకూ ఆయుష్య మండపంలో స్వామికి హోమం చేశారు. హోమ గుండంలో ద్రవ్యాలను సమర్పించి ఆయుష్య హోమం పూర్ణాహుతి సమర్పించారు. ఏర్పాట్లను దేవస్థానం చైర్మన్ ఐవీ రోహిత్ పర్యవేక్షించారు. వేద పండితులు గొల్లపల్లి ఘనాపాఠి, చిట్టి శివ, ముష్టి పురుషోత్తం, ప్రధానార్చకుడు కోట సుబ్రహ్మణ్యం, అర్చకుడు సుధీర్, పరిచారకుడు శివ పాల్గొన్నారు.

**హుండీ ఆదాయం లెక్కింపు**

అన్నవరంలోని సత్యనారాయణ స్వామివారి దేవస్థానానికి హుండీల ద్వారా 32 రోజులకు గాను రికార్డు స్థాయిలో ఆదాయం సమకూరింది. ఇందులో నగదు రూ.1,58,68,781 కాగా, చిల్లర నాణేలు రూ.5,49,820 వచ్చాయని దేవస్థానం చైర్మన్ ఐవీ రోహిత్, ఈఓ కె.రామచంద్రమోహన్ తెలిపారు. వీటితో పాటు బంగారం 44 గ్రాములు, వెండి 880 గ్రాములు, విదేశీ డాలర్లు కూడా ఉన్నాయి. ఈ లెక్కింపు కార్యక్రమంలో దేవస్థానం సిబ్బంది, పలు స్వచ్ఛంద సంస్థల సభ్యులు పాలు పంచుకున్నారు.

## అర్జీలకు వేగంగా పరిష్కారం చూపాలి

జిల్లా కలెక్టర్ మహేష్‌కుమార్



వేదికలో అర్జీలను తీసుకుంటున్న కలెక్టర్ తదితరులు

అమలాపురం రూరల్: ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం ద్వారా అర్జీదారులు సంతృప్తి చెందేలా సమస్యలకు త్వరితగతిన నాణ్యమైన పరిష్కారం చూపాలని జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ గోదావరి భవన్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. కలెక్టర్ మహేష్‌కుమార్, జాయింట్ కలెక్టర్ టి.నిశాంతి, ఐసీడీఎస్ పీడీ ఝాన్సీ రాణి, సమగ్ర శిక్ష అసిస్టెంట్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ ఎ.మధుసూదనరావుతో కలసి 182 అర్జీలను స్వీకరించారు. కలెక్టర్ మాట్లాడుతూ అందిన అర్జీలను ప్రాధాన్యతగా ఎప్పటికప్పుడూ బాధ్యతాయుతంగా నూరు శాతం పరిష్కరించాలన్నారు. జిల్లా వ్యాప్తంగా మండల, డివిజన్ స్థాయిలో నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదికలో చిత్తశుద్ధితో ప్రజల సమస్యలను పరిష్కరించాలని పేర్కొన్నారు. వచ్చిన అర్జీలను అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి సమస్యపై అవగాహనతో పరిష్కరించేందుకు క్షేత్రస్థాయిలో పారదర్శకంగా విచారణ చేయాలన్నారు. కార్యక్రమంలో గ్రామ వార్డు సచివాలయ నోడల్ అధికారి భీమేశ్వర్, డీఆర్‌డీఏ పీడీ డాక్టర్ శివశంకరప్రసాద్, డ్వామా పీడీ మధుసూదన్, డీఎంహెచ్‌వో దుర్గారావు దొర, డీఈఓ కమలకుమారి, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

**ఎస్పీ కార్యాలయానికి 20 అర్జీలు**

అమలాపురం టౌన్: స్థానిక జిల్లా ఎస్పీ కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి 20 అర్జీలు వచ్చాయి. కాకినాడకు చెందిన రాజులపూడి ఆరుద్ర దివ్యాంగురాలైన తన కుమార్తెతో ఎస్పీ కార్యాలయానికి వచ్చి తమ సమస్యపై ఫిర్యాదు చేసింది. అమలాపురంలో తన బంధువులు కొందరు తన ఆస్తిని అమ్ముకోనివ్వకుండా ఇబ్బంది పెడుతున్నారని ఆరుద్ర ఎస్పీకి వివరించింది. తన దివ్యాంగ కుమార్తెకు కూడా రక్షణ కల్పించాలని ఆమె విజ్ఞప్తి చేసింది. అలాగే ఈ సమస్యపై ఎస్పీతో పాటు ఎంపీ, అమలాపురం పట్టణ పీఎస్‌లో కూడా ఫిర్యాదు చేసినట్లు ఆరుద్ర స్థానిక విలేకరులకు తెలిపారు. రామచంద్రపురం మండలం చిన్న తాళ్లపాలానికి చెందిన కట్టా రమణ అనే మహిళ తన కుమారుడిపై ఆ మండలానికి చెందిన కొంతమంది రాజకీయ నాయకులు అక్రమ కేసు పెట్టి భయభ్రాంతులకు గురి చేస్తున్నారని ఆమె ఎస్పీకి ఫిర్యాదు చేసింది. వచ్చిన 20 అర్జీల్లో కొన్ని ఫిర్యాదులు తమ ఆస్తి, కుటుంబ తగాదాలపై కొందరు కుటుంబ సమేతంగా వచ్చి ఎస్పీకి తమ సమ్యస్యలను చెప్పుకున్నారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక పర్యవేక్షణ ఎస్సై డి.శశాంక కూడా పాల్గొన్నారు.

## మూడేళ్లలో రూ.17.31 కోట్ల సీఎస్సార్ నిధులు

- ఓఎన్జీసీ ప్రకటన
- అభివృద్ధికి సహకరించాలని కోరిన జిల్లా ప్రజాప్రతినిధులు



ఓఎన్జీసీ ప్రతినిధులతో మాట్లాడుతున్న మంత్రి సుభాష్, ఎంపీ హరీష్, కలెక్టర్ మహేష్‌కుమార్, జిల్లా ఎమ్మెల్యేలు

సాక్షి, అమలాపురం: 'గడచిన మూడేళ్లలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో రూ.17.31 కోట్ల సీఎస్సార్ నిధుల కింద మంజూరు చేశాం. ఇప్పటి వరకు రూ.13.35 కోట్లు కోనసీమ జిల్లాలోనే ఖర్చు చేశామన్నారు. కొన్ని పనులకు మొదటి విడతగా నిధులు మంజూరు చేయడం జరిగింది. యుటిలైజేషన్ సర్టిఫికెట్లు సమర్పిస్తే తదుపరి విడత నిధులు కూడా మంజూరు చేస్తాము' అని ఓఎన్జీసీ రాజమండ్రి అసెట్ మేనేజర్ శంతనుదాస్, కాకినాడ అసెట్ మేనేజర్ రత్నేష్‌లు తెలిపారు. కలెక్టరేట్‌లో సోమవారం ఓఎన్జీసీ సంస్థ ప్రతినిధులతో జిల్లాకు చెందిన రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్, అమలాపురం ఎంపీ గంటి హరీష్ మాధుర్‌తో పాటు ఏడు నియోజకవర్గాలకు చెందిన ఎమ్మెల్యేలు చర్చించారు. జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ మాట్లాడుతూ 2019 నుంచి ఇప్పటి వరకు కోనసీమ ప్రాంతంలో 1,370 పనులు సీఎస్సార్ కింద మంజూరయ్యాయని 913 పనులు పూర్తయ్యాయని, 290 పనులు జరుగుతూ ఉన్నాయని, 167 పనులు ఇంకా మొదలు కాలేదని వివరించారు. గత పదేళ్లలో జిల్లా నుంచి 14 వేల మంది చిన్న చిన్న ఉద్యోగాల కోసం విదేశాలకు వెళ్లినట్లు డేటా ఉందన్నారు. స్థానికంగానే ఉద్యోగాలు కల్పించేందుకు అవసరమైన నైపుణ్యాలను అభివృద్ధి చేశామని, ఓఎన్జీసీలో పనిచేయడానికి అవసరమైన నైపుణ్యాలను జిల్లా యంత్రాంగానికి తెలపాలన్నారు. సీఎస్సార్ కింద జరిగే పనులను పరిశీలించడం కోసం ఒక వెబ్‌సైట్ ఏర్పాటు చేయడం జరిగిందని.. ఇక నుంచి మంజూరైన పనులన్నీ ఆ వెబ్‌సైట్‌లో ఉంచుతామన్నారు.

కార్పొరేట్ సోషల్ రెస్పాన్స్‌బులిటీ నిధులు మంజూరుకు ఉదారంగా వ్యవహరించి జిల్లా అభివృద్ధికి సహకరించాలని ఓఎన్జీసీని జిల్లాకు చెందిన ప్రజా ప్రతినిధులు కోరారు. ఓఎన్జీసీ కార్యకలాపాలు కోనసీమ జిల్లా కేంద్రంగా జరుగుతున్నాయని వారు గుర్తు చేశారు. ఓఎన్జీసీ ఎన్నో హామీలు ఇస్తోందని, కాని ఒక్క గ్రామంలో కూడా పూర్తి స్థాయిలో పనులు చేయడం లేదని వారు అన్నారు. దెబ్బతిన్న రోడ్లు వేయడంతో పాటు స్థానికుల ఉద్యోగ అవకాశాలు కల్పించాలని కోరారు. జిల్లాలో కొత్త ప్రాజెక్టులను నిర్మిస్తున్నప్పుడు ప్రాజెక్టు నిర్మాణ వ్యయంలో ఒక శాతం నిధులు స్థానికంగా మౌలిక సదుపాయాలు కల్పనకు ఖర్చు చేయాలని కోరారు. సీఎస్సార్ నిధులు మంజూరు చేసేటప్పుడు జిల్లా యంత్రాంగం ద్వారా మాత్రమే నిధులు మంజూరు చేయాలి, మా నియోజకవర్గాలల్లో చేపట్టే ప్రాజెక్టులు, నిధులు ఖర్చు సమాచారం స్థానిక ఎమ్మెల్యేలకు చెప్పాలని కోరారు. ఎమ్మెల్యేలు బండారు సత్యానందరావు, అయితాబత్తుల ఆనందరావు, గిడ్డి సత్యనారాయణ, దాట్ల సుబ్బరాజు, వేగుళ్ల జోగేశ్వరరావు, దేవ వరప్రసాదరావులు పాల్గొన్నారు.

## సీఐపై కలెక్టర్‌కు ఫిర్యాదు



సీఐపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న వెంకట సావిత్రీదేవి

అమలాపురం రూరల్: పి.గన్నవరం సీఐ ప్రశాంత్‌కుమార్‌పై చర్యలు తీసుకోవాలని అయినవిల్లి మండలం కె.జగన్నాథపురం 3వ వార్డు మెంబర్ శీలం వెంకట సావిత్రీదేవి కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. సోమవారం కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఈ మేరకు ఫిర్యాదు చేశారు.

టీడీపీ మద్దతుతో వార్డు మెంబర్‌గా ఎన్నికయ్యానని అప్పటి అధికార పార్టీ నాయకుల బలంతో సీఐ ప్రశాంత్‌కుమార్ దొంగ నోట్లు మారుస్తున్నారంటూ తమ బీరువాను బద్దలుగొట్టారని, క్షమాపణ చెప్పమని బెదిరించారని ఆమె ఫిర్యాదులో పేర్కొన్నారు.



## విపత్తు ప్రభావిత ప్రాంతాల మ్యాపులను తయారు చేయాలి

అమలాపురం రూరల్: జిల్లాలో విపత్తులకు ప్రభావితమయ్యే ప్రాంతాలను గుర్తిస్తూ మండలాల వారీగా మ్యాపులు తయారు చేయాలని కలెక్టర్ మహేష్‌కుమార్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో జలవనరుల శాఖ, విద్యుత్ శాఖ అధికారులతో వరదలు, తుపాన్లపై సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో మండలాల వారీగా కాలువలు, డ్రైన్లు, హెడ్ వర్క్స్ విభాగాల్లోని అసెట్స్‌ను గుర్తిస్తూ మ్యాపులను తయారు చేయాలన్నారు. వరదలు సంభవించినప్పుడు కాలువలపై ఉండే లాకులు, షట్టర్లు, డ్రైన్లలో క్లాగింగ్ ప్రదేశాలు, అవుట్‌ఫాల్ సూయిజ్‌లు, ఏటిగట్లను గుర్తిస్తూ మ్యాపులు తయారు చేయాలన్నారు. కాలువలు, డ్రైనేజ్, హెడ్‌వర్క్స్, విద్యుత్ అధికారులను సమన్వయం చేసుకుంటూ ధవళేశ్వరం బ్యారేజీ వద్ద మొదటి, రెండవ, మూడో ప్రమాద హెచ్చరిక జారీ చేసినప్పుడు ప్రభావితమయ్యే ప్రాంతాలు, విద్యుత్ ఉప కేంద్రాలు, గ్రామాలను గుర్తిస్తూ విడివిడిగా మూడు మ్యాప్‌లు మండలాల వారీగా రెండు రోజుల్లో చేయాలన్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ టి.నిశాంతి, హెడ్ వర్క్స్ ఈఈ విశ్వేశ్వరరావు, డీపీవో రాంబాబు, కాలువలు, డ్రైన్లు, హెడ్‌వర్క్స్ డీఈఈలు, ఏఈఈలు, విద్యుత్, సర్వే అధికారులు పాల్గొన్నారు.

## చిందాడగరువు చెరువు మీదుగా రైల్వే లైన్ వద్దు

అమలాపురం టౌన్: అమలాపురం రూరల్ మండలం చిందాడగరువు గ్రామంలోని పురాతన అమరేశ్వరస్వామి ఆలయానికి అనుబంధంగా ఉన్న విశిష్టమైన చెరువు మీదుగా కోటిపల్లి–నర్సాపురం రైల్వే లైన్ వద్దని విశ్వహిందూ పరిషత్ జిల్లా శాఖ అధ్యక్షుడు అక్కిరెడ్డి సుబ్రహ్మణ్యం ఆందోళన వ్యక్తం చేశారు. సోమవారం ఆయన మాట్లాడుతూ 12 ఏళ్లకోసారి జరిగే గోదావరి పుష్కరాల సందర్భంగా ఈ చెరువుకు ఎంతో విశిష్టత ఉందని గుర్తు చేశారు. ఈ ఆలయానికి అనుబంధంగా పూర్వం నుంచి ఉన్న దాదాపు 27 ఎకరాల చెరువులో పది ఎకరాలను గతంలోనే ఆర్‌డబ్ల్యూఎస్ శాఖ తీసుకుని దాదాపు 13 గ్రామాలకు ఇక్కడ నుంచి తాగునీటిని సరఫరా చేసే ప్రాజెక్ట్‌ను నిర్మించిందన్నారు. మిగిలిన 17 ఎకరాలు చెరువుగా ఉన్న ఆ ప్రాంతాన్ని ప్రజలు ఎంతో పవిత్రంగా చూసుకుంటారని గుర్తు చేశారు. రైల్వే లైన్ అలైన్‌మెంట్‌ను ఈ చెరువుకు దూరంగా మార్చాలని జిల్లా కలెక్టర్‌తో పాటు రైల్వే అధికారులకు లిఖిత పూర్వకంగా విజ్ఞప్తి చేశామన్నారు.


## డయాలసిస్ సెంటర్ ప్రారంభం

రాజోలు: రాజోలు ప్రభుత్వాస్పత్రిలో నూతనంగా ఏర్పాటు చేసిన డయాలసిస్ సెంటర్‌ను ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సమీప పరిసర ప్రాంతాల్లో సుమారు 150 మంది కిడ్నీ బాధితులు ఉన్నట్టు గుర్తించామన్నారు. డయాలసిస్ కేంద్రం ఏర్పాటుకు శ్రమించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మానేపల్లి అయ్యాజీ వేమా, ఎంపీపీ కేతా శ్రీనివాస్ పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలల్లో స్వచ్ఛ ఉత్సవం

- ఈ నెల 15 వరకూ కార్యక్రమం
- వ్యక్తిగత, పాఠశాల పరిశుభ్రతపై విద్యార్థులకు అవగాహన
- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అన్ని పాఠశాలల్లో అమలు

రాయవరం: విద్యాలయాల్లోనే దేశ భవిష్యత్ నిర్మితమవుతుందన్న విషయం అందరికీ తెలిసిందే. అటువంటి విద్యాలయాల్లో స్వచ్ఛతను ఒక జీవన నైపుణ్యంగా మార్చేందుకు, స్వచ్ఛతపై నిరంతర సేవా భావ స్ఫూర్తిని నింపేందుకు 'స్వచ్ఛ పక్వాడా' కార్యక్రమాన్ని సెప్టెంబర్ ఒకటో తేదీ నుంచి ప్రారంభించేందుకు సమగ్ర శిక్షా చర్యలు చేపట్టింది. సీజనల్ వ్యాధుల ప్రబలుతున్న నేపథ్యంలో ప్రతి ఒక్కరూ పరిశుభ్రత పాటించడం ద్వారా అనారోగ్యం దరిచేరకుండా చూసుకునే వీలుంటుంది. ఈ విషయాలపై అవగాహన పెంచేందుకు ఏటా కేంద్ర మానవ వనరుల అభివృద్ధి మంత్రిత్వ శాఖ ఆదేశాల మేరకు రాష్ట్ర విద్యా పరిశోధన శిక్షణ సంస్థ, సమగ్ర శిక్షా సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని 15 రోజుల పాటు నిర్వహించేందుకు కార్యాచరణను రూపొందించారు.




**1,579 ప్రభుత్వ పాఠశాలల్లో..**

విద్యార్థులకు సమాజంపై బాధ్యత, స్వచ్ఛతపై అవగాహన కల్పించడం, వారిలో దాగి ఉన్న ప్రతిభను గుర్తించేలా సమగ్ర శిక్షా కార్యాచరణ రూపొందించారు. స్వచ్ఛ పక్వాడా పక్షోత్సవాలను జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని ప్రభుత్వ యాజమాన్య పాఠశాలల్లో అమలు చేయాల్సి ఉంది. జిల్లాలోని 1,579 ప్రభుత్వ యాజమాన్య పాఠశాలల్లో స్వచ్ఛ పక్వాడా ఉత్సవాలు నిర్వహించేందుకు జిల్లా అధికారులు పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు ఆదేశాలు జారీ చేశారు. దీనికి సంబంధించిన కార్యక్రమాల షెడ్యూల్‌ను పాఠశాలలకు అందజేశారు. అయితే ఈ నెల ఒకటో తేదీ ఆదివారం, 2వ తేదీ భారీ వర్షాల కారణంగా సెలవు ప్రకటించడంతో మూడో తేదీ నుంచి షెడ్యూల్ వారీగా కార్యక్రమాలు నిర్వహించాల్సి ఉంది.

**అన్ని పాఠశాలల్లో అమలు చేయాలి**



స్వచ్ఛతా పక్షోత్సవాలను ప్రతి పాఠశాలలో అమలు చేయాలి. దీనికి సంబంధించిన ఆదేశాలను అమలు చేసే విధంగా కింది స్థాయికి ఆదేశాలు జారీ చేశాం. విద్యార్థులు, సమాజాన్ని చైతన్యం చేసే విధంగా కార్యక్రమాల అమలుకు సమగ్ర శిక్షా ఉన్నతాధికారుల ఆదేశాలను కచ్చితంగా అమలుకు పాఠశాలల ప్రధానోపాధ్యాయులు చర్యలు తీసుకోవాలి. రోజు వారీ కార్యక్రమాలకు సంబంధించిన ఫొటోలను అప్‌లోడ్ చేయాలి.

– ఎ.మధుసూదనరావు, అదనపు ప్రాజెక్టు కోఆర్డినేటర్, సమగ్ర శిక్షా, అమలాపురం

**పక్షం రోజుల పాటు జరిగే కార్యక్రమాలు..**

సెప్టెంబరు ఒకటిన స్వచ్ఛశపథ్, 2, 3 తేదీల్లో పాఠశాల స్థాయిలో ప్రజాప్రతినిధులు/ఎస్‌ఎంసీ చైర్మన్, ఎస్‌ఎంసీ సభ్యులతో ఏఎన్‌ఎం, అంగన్‌వాడీ వర్కర్, మహిళా సభ్యులతో అవగాహన, ర్యాలీ ఏర్పాటు, 4, 5 తేదీల్లో నీటి వృథా అరికట్టడంపై విద్యార్థులకు అవగాహన, జలశక్తి అభియాన్ ద్వారా నీటి సంరక్షణకు చర్యలు, అవగాహన, 6న నీటి సంరక్షణ, సింగిల్ యూజ్డ్ ప్లాస్టిక్ నిర్మూలనపై విద్యార్థులకు అవగాహన, 7, 8 తేదీల్లో స్వచ్ఛతా పక్వాడాలో భాగంగా విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వం తదితర అంశాల్లో పోటీలు నిర్వహిస్తారు. 9, 10 తేదీల్లో రోజు వారీ జీవన విధానంలో చేతుల పరిశుభ్రతపై, 11న వ్యక్తిగత పరిశుభ్రతపై విద్యార్థులకు అవగాహన, 12న విద్యార్థులను సమాజంలో భాగస్వామ్యం చేయడంపై కార్యక్రమం, 13, 14 తేదీల్లో స్వచ్ఛతపై ప్రణాళికను విద్యార్థులతో సిద్ధం చేయించడం, 15న పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతుల ప్రదానం చేస్తారు.